అమ్మలను గన్నయమ్మ చాల పెద్దమ్మ
ముగ్గురమ్మల మూలపుటమ్మ అన్నారు పోతనామాత్యుడు

విశాఖ వన్‌టౌన్‌లో అమ్మవారికి నాలుగు లక్షల నోట్లతో అలంకరణ

ఉన్నది ఒక అమ్మే. ఆ అమ్మే జగత్తులో అనేక అమ్మల్ను సృజిస్తుంది. ఆ అమ్మ పెద్దమ్మ. సురాసురలను కన్న అమ్మ.

ధాన్యం ధనం, పశుపుత్రులను ప్రదానం చేస్తుంది. ప్రకృతిలోని పచ్చదనం ఆమె. రాక్షసత్వం భరిస్తున్నదీ ఆమే! రాశులుగా ధనం కురిపిస్తున్నదీ ఆ అమ్మే. విశాఖపట్టణంలోని నాగదేవి అమ్మవారిని నాలుగు లక్షల రూప్యములతో అలంకరించారన్నప్పుడు మహదానందం కలిగింది.

వరలక్ష్మి వత్రం సందర్భంగా విశాఖలోని నాగదేవి అమ్మవారిని నాలుగు లక్షల కరెన్సీతో అలంకరించారు.

తిరుచానూరు, విశాఖపట్నం, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు భారీగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఇక విశాఖ వన్‌టౌన్‌లోని ఆదిశక్తి నాగదేవి ఆలయంలో అమ్మవారిని నాలుగు లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాలకు హాజరయ్యారు. ●

(15వ పేజీ తరువాయి)

అమ్మవారి ప్రత్యేక పూజలు

శ్రావణ చైత్రమాసంలో వచ్చే పౌర్ణమి నవరాత్రి ఉత్సవాలలో విశేష పూజలు జరుగుతాయి. ప్రతి శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారు. కొల్హాపూర్‌లో చేసిన చిన్నదానం కూడా మేరు పర్వతమంతటి ఫలాలనిస్తుందని పురాణోక్తి. ఆలయ గుండంలో జ్యోతి ప్రజ్వలనం చేస్తే జీవితంలో ఎదురయ్యే కష్టాలన్నీ నశించి శాంతి సౌఖ్యాలు సిద్ధిస్తాయని స్థలపురాణం.

శ్రీచక్రపూజలతో జీవితం నందనవనం

అక్కడ అమ్మవారిని సేవిస్తే సంతానం లేని వారికి సంతానం కలుగుతుందట. పిల్లలను అమ్మవారి సమక్షంలో ఉంచితే వారి భవిష్యత్తు అమోఘంగా ఉంటుందట. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించి పాయసాన్ని సమర్పిస్తే రోగాలు నయమైపోతాయట. అవివాహితులు శ్రీచక్రపూజలు జరిపిస్తే వివాహయోగం కలిగివారి జీవితం నందనవనంలా ఉంటుందని భక్తుల విశ్వాసం.

ఇతర దర్శనీయ స్థలాలు

కొల్హాపూర్‌లోని ప్రతి కోటకీ అబ్బురపరిచే చారిత్రక వారసత్వం ఉంది. మహారాజ భవనం 200 గదులతో 3 అంతస్తులతో విశాలమైన మైదానం మధ్యలో ఉన్నది. నాటి రాజుల ఆయుధాలు, రాజరికపు సామగ్రి ఇందు పొందుపరిచారు. చరిత్ర ప్రేమికులు శాహు ప్రదర్శనశాల తప్పక సందర్శించాలి. సంప్రదాయ కుస్తీ కళను ఇప్పటికీ సాధన చేసే ఖుష్బాగ్ మైదానంలో ఒకే సారి 30 వేల మందికి కూర్చునే వసతి ఉన్నది. ప్రకృతి ప్రేమికులు ఇక్కడి చెరువుల ఒడ్డున కాలక్షేపం చేయవచ్చు. పిల్లలను అలరించే చోటు 'రంకాల చౌపాటే' దత్తాత్రేయుడి రెండవ అవతారం నృసింహ సరస్వతి ఇక్కడికి 60 కిలోమీటర్ల దూరంలో కృష్ణ, పంచగంగల సంగమ క్షేత్రమైన నర్సోబావాడిలో తపస్సు చేసుకున్నారు. అక్కడవారి పాదుకల మందిరం ఉంది. పన్హాలా కొండలపై శివాజీ కోట, జ్యోతిబా మందిరం ప్రసిద్ధి చెందినవి.

వడాపావ్ టేస్ట్

'దేశపు చక్కెర పాత్ర'గా పేరుగల కొల్హాపూర్‌లో వడాపావ్, పావ్‌మిశాల్ ప్రసిద్ధ ప్రసాద వంటకాలు. ఇక కొల్హాపూర్ చెప్పుల జతలు కొనకుండా తిరుగుముఖం పట్టలేం. మహారాష్ట్రియన్ స్టైల్‌లోని ఆర్టిఫీషియల్ నగలు, వెండి వస్తువులు మంచి డిజైన్లలో ఇక్కడ లభిస్తాయి.

కొల్హాపూర్ ఇలా చేరుకోవచ్చు!

ముంబై నుంచి 387, పుణే నుంచి 240 హైదరాబాద్ నుంచి 540 కిలోమీటర్లు. కొల్హాపూర్‌కి బస్సులు, రైలు రవాణా సౌకర్యాలు ఉన్నాయి. విమాన, రైలు, రోడ్డు మార్గాల ద్వారా ఈ నగరం ఇతర ప్రధాన నగరాలకు కలపబడి ఉంది. వాయు మార్గం అయితే, ఉజలాయివాడిలో విమానాశ్రయం ఉంది. రైలు మార్గం ముంబై పుణేల నుంచి చేరుకోవచ్చు. రోడ్డు మార్గంలో ప్రభుత్వ ప్రైవేటు బస్సు సర్వీసుల ద్వారా ఈ క్షేత్రం చేరుకోవచ్చు.

– చిలుకమర్తి నిర్మలా రెడ్డికి కృతజ్ఞతలు

Lovely Stay at Holy Tirupathi *The Gateway of Lord Balaji*

HOTEL MAYURA

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

మొక్కజొన్న తోటలో ముసిరిన చీకట్లలో... మంచెకాడ కలుసుకో మరువకు మరువకు మామయ్యా

వరి, గోధుమల్లాంటి ధాన్యాల్లో కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉంటాయి. పండ్లూ కూరగాయల్లో విటమిన్లు ఖనిజాలు సమృద్ధిగా దొరుకుతాయి! మొక్క జొన్న తింటే కాలక్షేపం తప్ప.. ఏముంటుందని అనుకోరాదు. ఆ రెండింటిలోని పోషకాలు ఇందులో ఉన్నాయి. మొక్క జొన్నలో మంచి పోషకాహారాలు ఉన్నాయి.

సన్నని చినుకులు పడుతూ ఉంటే ఎర్రని నిప్పుల మీద మొక్కజొన్న పొత్తు కాలుస్తుంటే వచ్చే ఆ కమ్మని వాసనకి గులాం కానివాళ్ళు ఉంటారంటే నమ్మలేం. అలాంటిది వాటిని తింటే ఉండే రుచి గురించి వేరే చెప్పాలా... ఇక గింజల్ని ఉడికించి కాస్త వెన్న జోడించి అందించే స్వీట్‌కార్న్ వాసనకి ఎవరైనా ఫిదా కావలసిందే. అంతేనా...పాలొద్దు టిఫినొద్దు అంటూ మారాం చేసే పిల్లలకు పాలల్లో కాసిని కార్న్‌ఫ్లేక్స్ వేసిస్తే మారుమాట్లాడరంటే అతిశయోక్తి కాదు. సూప్ తాగినా, సలాడ్‌గా తిన్నా ఏ రూపంలో తీసుకున్నా మొక్కజొన్న రుచే వేరు. చిరుతిండిగా తినే పాప్‌కార్న్ సంగతి సరేసరి. అందుకే సుమారు తొమ్మిదివేల సంవత్సరాల క్రితమే మెజో అమెరికన్లు పండించిన మొక్కజొన్న నేడు ప్రపంచ వ్యాప్త ఆహారంగా మారింది. ఆనాటి నుంచి ఈనాటి వరకూ దీన్ని వాళ్లు కూరగాయగాను ఉపాహారంగాను చిరుధాన్యంగాను వాడుతూనే ఉన్నారు. అంతేకాదు జన్యుమార్పుల ద్వారా మేలైన వంగడాలనూ సృష్టిస్తున్నారు.

రంగు పండింది!

మనకు ఎక్కువగా పసుపు, తెలుపు రంగుల్లోని సాదా, తీపిమొక్కజొన్న (స్వీట్‌కార్న్)లు మాత్రమే తెలుసు. కానీ ఎరుపూ, గులాబీ, ఊదా, ఆకుపచ్చా, నలుపూ, నీలమూ, హరివిల్లూ... ఇలా మనకు తెలీని రంగులు చాలా ఉన్నాయి. ఒక్కో రంగుదీ ఒక్కో ప్రత్యేకత. ఒక్కో రుచి. పసుపురంగు కార్న్‌లో ల్యూటెన్, జియాక్సాంథిన్, వంటి కురోటినాయిడ్లు ఎక్కువగా ఉంటే, నీలిరంగు మొక్కజొన్నలో ఆంథోసైనిన్ల శాతం ఎక్కువ. ఉదారంగు మొక్కజొన్నలో హైడ్రాక్సీబెంజాయిక్ ఆమ్లం ఉంటుంది. ఇవన్నీ కూడా అద్భుతమైన యాంటీఆక్సిడెంట్లలా పనిచేస్తాయి.

రంగుల సంగతలా ఉంచి, ఉపయోగించే పద్ధతిని బట్టి ఫ్లోర్, పాప్, డెంట్, ఫ్లింట్, స్వీట్, వాక్సీ... ఇలా ఆరు ప్రధాన రకాలుగా మొక్కజొన్నల్ని చెప్పవచ్చు. ఫ్లోర్, ఫ్లింట్, డెంట్... రకాలను ఎక్కువగా పిండికీ, ఫ్లేక్స్‌కి వాడితే, వేడి చేసినప్పుడు పాప్ అయ్యే రకాన్ని మాత్రం పాప్‌కార్న్‌గా వాడతారు. జన్యు మార్పు ద్వారా ఆవిర్భవించిన స్వీట్ కార్న్‌ను నేరుగాను లేదా ఉడికించి తింటారు. మెరుస్తున్నట్లుగా ఉండే వ్యాక్సీ రకాన్ని టెక్స్‌టైల్స్ కాగితం తయారీ పరిశ్రమలతోబాటు మెయొనెజ్, మార్గరిన్, చూయింగ్‌గమ్, ఐస్‌క్రీమ్ తదితర ఆహార పదార్థాల్లోనే వాడుతుంటారు.

కాల్చితింటే ఎంతో మజా ఉంటుంది!

తాజాగా ఉడికించి తింటే ఏ రకం మొక్కజొన్న అయినా మంచిదే. ఇందులో శక్తిమంతమైన పోషకాలతోపాటు ఎ,బి,సి,ఇ విటమిన్లు కొన్ని ఖనిజాలూ కూడా ఉన్నాయి. కార్న్‌కి కాస్త నిమ్మకాయ రాసుకుని తినడం వల్ల వాటిల్లో శరీరానికి అవసరమైన ఆమైనో ఆమ్లాలు, నియాసిన్ పోషకాల శాతం మరింత పెరుగుతుంది.

- రోజువారీ అవసరమైన పీచు ఓ కప్పు మొక్కజొన్న గింజల నుంచి దొరుకుతుంది. ఇది జీర్ణ సంబంధ సమస్యల్ని నివారిస్తుంది. మలబద్ధకంతోబాటు కొలొరెక్టల్, ప్లేగు క్యాన్సర్లనూ అడ్డుకుంటుంది.
- మొక్కజొన్నలో పుష్కలంగా ఉండే థైమీన్, నియాసిన్ అనే విటమిన్లు నాడీవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తాయి. ఇంకా పాంటోథెనిక్ ఆమ్లం జీవక్రియకు దోహద పడుతుంది. గర్భిణులకు అవసరమైన ఫోలేట్ శాతం, మొక్కజొన్నల్లో ఎక్కువే!
- ఇ-విటమిన్ యాంటీ ఆక్సిడెంట్ పనిచేస్తూ వ్యాధులనుంచి శరీరాన్ని రక్షిస్తుంది. ●

పోషకాలు

తాజా కార్న్‌లో (వంద గ్రా.)

క్యాలరీలు	:	86 క్యాలరీలు
పిండి పదార్థాలు	:	19,02 గ్రా.
కొవ్వులు	:	1.18 గ్రా.
ప్రోటీన్లు	:	3.2 గ్రా.
నియాసిన్	:	1.7 మి.గ్రా
ఫోలేట్	:	46 మై.గ్రా.
విటమిన్ ఎ	:	9. మై.గ్రా
విటమిన్ సి	:	6.8 గ్రా.
ఐరన్	:	0.52 గ్రా.
మెగ్నీషియం	:	37 మి.గ్రా.
పొటాషియం	:	270 మి.గ్రా
నీరు	:	75.96 గ్రా

SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation

పొడుగాటి జడపైన మల్లెపూల సౌరభం!
స్త్రీ సౌభాగ్యత్వాన్ని తెలియచేస్తుంది

కేశాలు అతివల సౌందర్యాన్ని ఇనుమడింపచేస్తాయనడంలో సందేహం లేదు. అందుకే కేశాలంకరణ మీద మక్కువ చూపని మగువలు ఉండరు. ఒత్తయిన, పొడుగాటి కేశ సంపదను సొంతం చేసుకోడానికి వారు ఉపయోగించని చిట్కాలు ఉండవు. అందమైన కేశసంపదతో వారు చేయని కేశాలంకరణ ఉండదు. కేశాలంకరణలో ఎన్ని రీతులు ఉన్నా, అతి ప్రాచీనమైనది, ప్రశస్తమైనది మగువ అందాన్ని పెంచేది వాలు జడ.

చిన్నతనంలో ఆడపిల్లలు, పొడుగాటి జడమీద మోజు పెంచుకుంటారు. పొడుగాటి జడ ఉన్నవారిని చూసి మురిసిపోతారు. తమకూ అంతపెద్ద జడ ఉంటే బాగుండునని కోరుకుంటారు. కాని, తల్లి, ఆడపిల్లలకు కూడా, పొడవు జుట్టు ఉండదు. కాబట్టి 'క్రాఫ్' దువ్వి వదిలేస్తుంది. జుట్టు కొంచెం ఎదిగిన తర్వాత, చిన్న చిన్న పిలకలు వేసి ముచ్చటపడుతుంది. ఈ దశలోనే ఆడపిల్లలు పొడుగాటి జడ మీద మమకారం పెంచుకుంటారు. పెద్దవాళ్ళు ఇంట్లో లేనప్పుడు (అమ్మ చూస్తే కోప్పడుతుందని తెలుసు) సవరమో, నల్ల రిబ్బనో ఎంచుకుని వాటితో తమకు తోచినట్లు పెద్ద జడ అల్లుకుని తెగ సంబరపడిపోతుంటారు. జుట్టు మెడక్రిందకు జారిన తర్వాత తల్లి, జడవేయడం మొదలుపెడుతుంది.

అప్పుడు ఆడపిల్లకు జడ ఎలా అల్లాలి అని ధర్మ సందేహం కలుగుతుంది. అమ్మ రోజూ ఎలా అల్లుతుందో గమనిస్తుంది. జడ అల్లడం తేలికని భావించి తాను అల్లడానికి ఉపయుక్తురాలవుతుంది. జడలో రెండు పాయలేగా కనిపించేవి అనుకుని, జట్టును రెండు భాగాలు చేసి, జడను అల్లడం ప్రారంభిస్తుంది. ఇక్కడే పప్పులో కాలేస్తుంది. జడలో అటొకటి, ఇటొకటి రెండు పాయలే కనిపించినా, నిజానికి జట్టును మూడు భాగాలు చేస్తే గాని, జడ అల్లడం సాధ్యం కాదని ఆ పసిమనసుకు తెలియదు. ఇదంతా తెలిసేసరికి ఆడపిల్ల ఎదిగిపోతుంది. జట్టును చిక్కులేకుండా దువ్వి మూడు సమభాగాలు చేసి అందంగా జడ అల్లడం కష్టమే సుమా– అనుకుంటుంది.

దక్షిణభారతదేశంలో జడ చాలా ప్రాముఖ్యతను సంతరించుకున్నది. అందునా ఆంధ్రప్రదేశ్, తమిళనాట దీనికి విశిష్ట స్థానం ఉంది. ఆడపిల్ల అందాన్ని ఇనుమడింపజేసే అంశాలలో జడ ఒకటి అనడంలో సందేహం లేదు. అందుకేనేమో ఎందరో కవులు జడ సొగసు మీద ఎన్నో కవితలు వ్రాశారు. 'సన్నాయి జడలోన సంపంగి' అని ఒక కవి జడను సన్నాయితో పోల్చితే 'కరినాగంటి జడచూడు' అని నల్లని నాగుతో జడను పోల్చిన కవి మరొకరు. శాస్త్రీయ నృత్యరీతులు 'కూచిపూడి, భరతనాట్యం' జోలికి వెళ్ళదలచుకుంటే, ఆడపిల్లకు జడ చాలా అవసరం. అది లేకుండా ఆహార్యంలో లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. సత్యభామ (పాత్ర) ఠీవికి ఈ జడే అసలు కారణం. పొడుగాటి జడ వయ్యారంగా తిప్పుతూ 'మీర జాలగలడా నా ఆనతి సత్యాపతి' అని సత్యభామ నర్తిస్తుంటే జనం కళ్ళప్పగించి చూడవలసినదే.

పదహారు అణాల ఆంధ్ర అమ్మాయి అంటే జడ ఉండి తీరాల్సిందే! పెళ్ళి కూతురు అనగానే మనమదిలో మెదిలేది బారెడు పూలజడే. జడకు అంత ప్రాముఖ్యత ఉండబట్టే ఆడపిల్లను కుదురుగా కూర్చోబెట్టి అమ్మో, అమ్మమ్మో, నాయనమ్మో జాగ్రత్తగా చిక్కుతీసినూనె రాసి జుట్టు దువ్వేవారు.

నేడు 'జడ' కనుమరుగయిపోతున్నది. ఆంధ్రుల నాగరికతను ఎలుగెత్తి చాటే ఒక అంశం అయిన జడను వేసుకోవడానికి నేటి యువత విముఖత వ్యక్తపరుస్తున్నది. పల్లెటూళ్ళలో, పట్టణాలలో జడ కొంతమేరయిన కనిపిస్తున్నది గాని, నగరాలలో జడ చేజారిపోయిందనే చెప్పాలి. దీనికి సవాలక్ష కారణాలు– జడ వేసుకునే సమయం లేని యాంత్రిక జీవితం. జడ అల్లుకునే ఓర్పు నశించడం. చిన్నప్పుడే పిల్లలను రెసిడెన్షియల్ స్కూల్స్‌లో పడవేయడం, పెద్ద జుట్టుతో తలంటు కష్టమని భావించి జుట్టు కత్తిరించుకోవడం. 'Bob', 'Pony' నాగరికత చిహ్నాలుగా మారడం. పాశ్చాత్య నాగరికతా వ్యామోహం– ఇలా కర్ణుడి చావుకు సవాలక్షా తొంభై కారణాలు– అన్నట్లు జడ కనిపించనంటున్నది.

నేడు యువతిని ప్రభావితం చేస్తున్న అంశాలు– సినిమా, టీవి అనేది నిర్వివాదాంశం. సినిమాలోని నాయకులను, టీ.వి. సీరియల్స్‌లోని నాయకులను, యాంకర్లను అనుకరిస్తున్న యువతీ సంఖ్య చాలా ఎక్కువ. అటువంటి సినిమా, టీవీలలో జడ– పల్లెటూరి పేదింటి, చదువులేని అమ్మాయికి మాత్రమే పరిమితమయిపోయింది. చదువుకున్న అమ్మాయికి 'జడ' ఉండదు. గొప్పింటి అమ్మాయికి సినిమాలోనే కాదు, నిజ జీవితంలో కూడా 'జడ' అరుదయిపోయింది. తెలుగు ప్రజల కోసం, తెలుగువారు నిర్వహిస్తున్న తెలుగు టీవి ఛానల్స్‌లో కనిపిస్తున్న తెలుగింటి యాంకర్లు జడను చిన్న చూపే చేస్తున్నారు. పండుగలకు పబ్బాలకు మాత్రమే పట్టుచీర కట్టుకుని, ఒంటినిండా నగలతో ముస్తాబవుతున్నారు. జడజోలికి మాత్రం పోవడం లేదు. దీనితో మధ్యతరగతి యువతులు కూడా జడ వేసుకోవడం అనాగరికం అనే భావనకు వచ్చేసినట్లున్నారు. వారిలో జడ అరుదుగా కనబడుతున్నది.

ఒక తెలుగింటి అమ్మాయిని ఎవరైనా ఎలా ఊహిస్తారు. చిత్రకారుడైతే ఎలా చిత్రీకరిస్తాడు? బారెడు జడ నడుముపై నర్తిస్తున్న అమ్మాయే ఊహలందు కదలాడుతుంది. తెలుగింటి ఆడపిల్లకూ, బారెడు జడకూ మధ్య ఉన్న అవినాభావ సంబంధం అలాంటిది. అందుకేనేమో కొందరు తెలుగింటి ఆడపడచులు వృత్తిరీత్యా, చదువురీత్యా విదేశాలు వెళ్ళినా జడుపులేక జడ సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. తెలుగువారి జడ సంస్కృతి చిరకాలం కొనసాగాలంటే 'ప్రాచీన సంస్కృతి'గా చట్టమొకటి తీసుకురావాల్సి వస్తుందేమో!

(తెలుగు విద్యార్థి పత్రికకు షకీలా బేగంకు కృతజ్ఞతలు)

Compliments from
Sri Krishna Bhat
When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala
WOOD SIDE ANNEXE
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
WOODSIDE
HOTEL WOODSIDE
E.Car Street, Tirupathi. Ph : 2284464

కళాప్రపూర్ణ ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ

తెలుగు భాషకు వన్నెతెచ్చి పెట్టిన కవయిత్రులు తిమ్మక్క, మొల్ల రంగాజమ్మ, ముద్దుపళని వెంగమాంబ మొదలైనవారు పురుషులతో సమానంగా తమ ప్రజాపాటవాల్ని ప్రదర్శించారు. ఆ కోవలోనే 20వ శతాబ్దంలో విద్యత్కవయిత్రిగా, స్వాతంత్ర్య సమరయోధురాలుగా, పరిశోధకురాలుగా ఉపన్యాసకురాలుగా, స్త్రీ జనాభ్యుదయ వాదిగా మహిళా లోకంలో ఆదర్శంగా నిలిచిన విదుషీమణి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు.

సాహితీవేత్తలకు సాహిత్యపోషకులకు సంస్మరణ రంగానికి, స్వాతంత్ర్యోద్యమానికి గోదావరీ ప్రవాహానికి సాక్ష్యంగా నిలిచిన రాజమహేంద్రవరంలో లక్ష్మీకాంతమ్మ సంగీత సాహిత్యాలకు నిలయమైన నాళము సుశీలమ్మ, కృష్ణారావు దంపతులకు 1917వ సంవత్సరం డిసెంబరు 21వ తేదీన జన్మించారు. అన్నతో కలిసి కోతికొమ్మచ్చు లాడుతూ సైకిల్ చక్రాలు తిప్పుతూ, గోడుంబిళ్ళ ఆటలు ఆడుతూ ఇరుగుపొరుగు పిల్లలతో కలివిడిగా ఉండటంతో ఆమె బాల్యం చక్కగా నడిచింది. ఆడ, మగా భేదం లేకుండా తండ్రి కృష్ణారావు గారి పెంపకంలో గుర్రపుస్వారీ కూడా నేర్చుకుని గడిదేరింది. బత్తుల కామక్షమ్మగారు నడుపుతున్న వైశ్య సేవా సదనంలో చదువుకొంటూ లక్ష్మీకాంతమ్మ అన్ని తరగతుల్లో ప్రథమురాలుగా నిలిచారు. కాలక్రమంలో ఆ వైశ్య సేవా సదనమే ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాలగా రూపుదిద్దుకుంది. అక్కడే ఆమె ఉభయ భాషా ప్రవీణురాలైంది. 1939వ సం॥ మార్చి నెలలో చీరాల వాస్తవ్యులు ఊటుకూరి వేంకటేశ్వర శ్రేష్టిగారి కుమారుడు హయగ్రీవ గుప్తాగారితో ఆమెకు వివాహమయ్యింది. బ్రహ్మసమాజ మతావలంబులైన పుట్టింటిలోను, వైదిక సంప్రదాయబద్ధులైన మెట్టినింటిలోను లక్ష్మీకాంతమ్మ గారు తన వ్యక్తిత్వాన్ని చక్కగా రూపు దిద్దుకున్నారు. ప్లీడరీ కోర్సు చదివి ప్రాక్టీసు చేస్తున్న భర్త గుప్తాగారు లక్ష్మీకాంతమ్మగారి రచనా వ్యాసంగాన్ని ప్రోత్సహించారు.

చదువుకుంటున్న రోజుల్లోనే గాంధీజీ పిలుపుతో లక్ష్మీకాంతమ్మ గారు సత్యాగ్రహ సమరంలో పాల్గొన్నారు. ఖాదీ వస్త్రాల అమ్మకం, ఊరేగింపులు మొదలైన కార్యక్రమాల్లో చాలా చురుకుగా పాల్గొనేవారు. గరిమెళ్ళ వారి 'మాకొద్దీ తెల్లదొరతనం' హరీంద్ర చటోపాధ్యాయగారి 'శురూహువా హైజంగ్ హమారా' దేశభక్తి గేయాలు అప్పటి రోజుల్లో పోలీసు అధికారులపై నాళము కృష్ణారావు వ్రాసిన 'సమ్మయ్యా నీ బ్రతుకమ్మెయ్యా 'ముస్తాఫా నీ కుస్తీ ఏమిరా' 'దప్పుల సుబ్బారావు' నీ బ్రతుకు అప్పులపాలేరా' మొదలైన పాటలను ఊరేగింపు ముందు నిల్చుని స్నేహితురాలు ఝాన్సీని కలుపుకొని లక్ష్మీకాంతమ్మ పాడేవారు. పోలీసు లాఠీ దెబ్బలకు ఎదురునిల్చి ప్రాణాలకు తెగించి ఉద్యమంలో పాల్గొన్నారు. జాతీయోద్యమానికి బాసటగా విరాళాలు పోగుచేసేవారు. 1935లో ఉభయ భాషా ప్రవీణ పూర్తి చేసేవరకు లక్ష్మీకాంతమ్మగారు స్వాతంత్రోద్యమంలోనే ఉన్నారు.

లక్ష్మీకాంతమ్మగారి జీవితం బహుముఖీమైనది. ఈమె పలు పదవులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యత్వం పొందిన మహిళల్లో ఈమె ప్రసిద్ధులు. ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ, తెలుగు భాషా సమితి, ఆంధ్ర మహిళా గానసభ, గోరంట్ల వెంకన్న ట్రస్టు బోర్డు మొదలైన సంస్థలలో లక్ష్మీకాంతమ్మ గారు సభ్యురాలుగా ఉండి విశిష్ట సేవలందించారు.

రాజమండ్రిలోని గౌతమీ గ్రంథాలయ కమిటీలోనూ, ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల వర్కింగ్ కమిటీలోను సభ్యురాలుగాను, వేటపాలెంలోని సారస్వత నికేతన గ్రంథాలయానికి పోషకురాలుగాను ఉన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సెనేట్‌లోను, ఆలిండియా రేడియో ఎడ్వయిజరీ కమిటీలోను ఆంధ్ర ప్రదేశ్ సంగీత అకాడమీలోను, కేంద్ర సాహిత్య అకాడమీలోనూ, లక్ష్మీకాంతమ్మగారు సభ్యురాలుగా ఉండి తమ ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శిస్తూ పేరు ప్రఖ్యాతులు పొందారు.

1934 సంవత్సరం మొదలుకొని 1991వ సం. వరకు ఆమె ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. వాటిలో 1. రాజమండ్రి మహిళా గానసభ నిర్వహించిన వీణ పోటీ పరీక్షలో స్వర్ణపతకం (1934). 2. ఏలూరు వై.ఎం. హెచ్.ఎ. వారు నిర్వహించిన మహిళాభ్యుదయంపై వక్తృత్వపు పోటీలలో స్వర్ణపతకం (1934) 3. ఉభయ భాషా ప్రవీణ పరీక్షలో ప్రథమస్థానం పొందినందుకు ఆంధ్రా విశ్వవిద్యాలయం వారి స్వర్ణపతకం (1935) 4. మద్రాసు ప్రభుత్వ పక్షాన తెలుగు భాషా సమితి నిర్వహించిన పోటీలో ఆంధ్ర కవయిత్రులు గ్రంథానికి ప్రథమ బహుమతి (1953) 5. గృహలక్ష్మి పత్రికవారిచే స్వర్ణకంకణ పురస్కారం (1954) ఇంకా అప్పికట్లలో తెనుగులెంక తుమ్మల సీతారామమూర్తిగారు, అప్పటి శాసనమండలి సభ్యులు శ్రీ కొణిజేటి రోశయ్యగారి సమక్షంలో లక్ష్మీకాంతమ్మగారికి గజాధిరోహణ మహోత్సవం (1969), అనంతపురంలో లలిత కళాపరిషత్‌వారు ఆచార్య తూమాటి దోణప్పగారి సమక్షంలో ఆమెకు కనకాభిషేకం (1988) టొరెంటో– కెనడా దేశంలో తెలుగు సంఘం వారిచే సన్మానం (1990) వంటివి ఎన్నో పేర్కొనదగినవి.

వైదుష్యానికి తగినట్లుగా బిరుదులూ లభించాయి. 1935లో రాజమండ్రిలో 'విద్వత్కవయిత్రి' 1952లో చీరాలలో 'ఆంధ్రసరస్వతి' 1966లో విజయవాడలో 'సాహితీ రుద్రమ' 1972లో గుంటూరులో ధర్మప్రచారభారతి, 1978లో చాల్తేరులో కళా ప్రపూర్ణ బిరుదు ప్రసిద్ధములు.

వచో నైపుణ్యంతో గొప్ప ఉపన్యాసకురాలుగా లక్ష్మీకాంతమ్మ పేర్గాంచారు. ఆమెకు ఉపన్యాసాలంటే నల్లేరు మీద బండి నడకే! అప్పటికప్పుడు ఉపన్యాసం చెప్పగలిగిన ప్రజ్ఞాశాలి లక్ష్మీకాంతమ్మ. పలు విశ్వవిద్యాలయాల్లో, గ్రంథాలయాల్లో మహిళమండలి సభల్లో మన రాష్ట్రంలోను పొరుగు రాష్ట్రాలల్లోను, విదేశాల్లోనూ పెక్కు చోట్ల ఉపన్యసించి ఉపన్యాసకేసరిగా గణుతికెక్కారు.

మనదేశంలోని పలు ప్రాంతాలు సందర్శించి ఉపన్యాసాలు చెప్పటమే గాక, కేంద్ర ప్రభుత్వం వారి ఆనతి మేరకు భారతదేశ స్వాతంత్ర్య రజితోత్సవాల సందర్భంగా తూర్పు జర్మనీ, జెకోస్లేవికాయ, రష్యా, కెనడా, అమెరికా దేశాలలోని గ్రంథాలయాలు, విశ్వవిద్యాలయాలు, చర్చీలను సందర్శించి అందుబాటులో ఉన్న పండితులు, ప్రొఫెసర్లతో చర్చలు జరిపారు. 'నా విదేశీ పర్యటన– అనుభవాలు' అనే పేరుతో ఒక పుస్తకాన్ని ప్రకటించారు.

లక్ష్మీకాంతమ్మ గారు సంస్కృతాంధ్ర భాషల్లో మొత్తం 18 గ్రంథాలు రచించారు. 1. కన్యకా పరమేశ్వరి సుప్రభాతం 2. దేవస్తవతారావళి 3. జాతిపిత ఈ మూడు గ్రంథాలు సంస్కృతంలో రచించినవి. తక్కిన 15 గ్రంథాలు తెలుగులో రచించినవి. మహిళా విక్రమసూక్తం పద్యకావ్యంలో 9 ఖండికలలో ఆయా కాలాల్లో ప్రసిద్ధిగాంచిన మహిళల విక్రమ స్తుతించారు. ప్రఖండం అనే శీర్షికలో:

'మహిళను మహిళయే ద్వేషించుటయును
సోదర మహిళ యువతి నోర్వమి
కూడనిపనియని యాడువారెపుడు
గ్రహింతురొ యపుడె మహిళాభ్యుదయము'

–అని మహిళాలోకానికి చక్కని సందేశమిచ్చారు.

భారతి, ప్రబుద్ధాంధ్ర, గృహలక్ష్మి మొదలైన ప్రతికల్లో ప్రచురించిన కవితల్ని ఏర్చికూర్చి 'లజ్జా కిరీట ధారిణి' అనే పద్యకావ్యంగా ప్రచురించారు.

లక్ష్మీకాంతమ్మగారు 'నా తెలుగు మాంచాల' అనే గేయ కావ్యంలో స్త్రీ పాత్రలకు ప్రాధాన్యమిచ్చారు. మాంచాల జీవితాన్ని నారీ లోకానికి ఆదర్శంగా చిత్రించదలచి మాంచాల పాత్రపోషణకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వదలచుకొన్న కారణంగా పల్నాటి వీరచరిత్ర నుండి మాంచాల బాలచంద్రుణ్ని యుద్ధానికి పంపే ఘట్టాన్ని మాత్రమే స్వీకరించారు. అభినవ పోతనగా ప్రసిద్ధిచెందిన వానమామాలై వరదాచార్యుగారు ఇంత చక్కని గేయ కావ్య రచన చూచినంతవరకు హృద్యము అని నా తెలుగు మాంచాల కావ్యాన్ని గురించి ప్రశంసించిన విషయం విదితమే.

'కన్యకమ్మ నివాళి' అనే పేరుతో సమాజాన్ని గూర్చి వ్యంగ్య ధోరణితో రాశారు. రూపాయి విలువను ప్రభుత్వం తగ్గించడం వల్ల జరిగిన అనర్థాన్ని, లోటు బడ్జెట్‌ను పూడ్చడానికి విదేశీ అప్పులు తేవడం వల్ల కలిగిన ఆర్థిక మాంద్యాన్ని అవగాహన చేసుకొని

కోట్లు కోట్లుగ అప్పు
కోరి తెచ్చుట తప్పు–
ముంచు కొచ్చెను ముప్పు

ఓ కన్యకమ్మా! అని కన్యకమ్మ నివాళిలో వ్యంగ్యంగా వివరించారు.

ఓట్లను అమ్ముకోవటం, డబ్బులున్న వాళ్ళకే సీట్లివ్వటం అనే రాజకీయ రంగంలోని పద్ధతిని, దుస్థితిని లక్ష్మీకాంతమ్మగారు ఎద్దేవా చేశారు. లంచగొండి అధికారులు తిరుపతికి వెళ్ళి తాము సంపాదించిన పాపపు సొమ్ములో వేంకటేశ్వరునికి కొంత ముడుపులు చెల్లించటాన్ని కూడా ఆమె వ్యంగ్యంగా చెప్పారు.

'వేనవేలుగ బండ్లు
వేంకటేశుని గుండ్లు
మనసునిండా ముండ్లు

ఓ కన్యకమ్మ అని వారి కపటభక్తిని వెల్లడించారు. ఈ కన్యకమ్మ నివాళి కావ్యానికి ఆరుద్రగారి కూనలమ్మ పదాలు స్ఫూర్తినిచ్చాయని ఆమె తెలిపారు.

హిందీ సాహిత్యంలో ప్రసిద్ధులైన కబీరు, తులసి, బృంద, రహీముల దోహాలకు లక్ష్మీకాంతమ్మగారు సదుక్తి మంజరి అనే పేరుతో స్వేచ్ఛానువాదం చేశారు.

1951లో వెలువరించిన ఆంధ్రకవయిత్రులు గ్రంథంలో ప్రాచీన కాలం నుండి తన వరకు గల 200 మంది కవయిత్రుల వివరాలను, వారి రచనల సొబగులను వివరించారు.

ఆంధ్రప్రదేశ్ తెలుగు సాహిత్య అకాడమీ పక్షాన 'అఖిలభారత కవయిత్రులు' అనే సంకలన గ్రంథాన్ని ఈమె ప్రకటించారు. 'ఆంధ్రుల కీర్తన వాఙ్మయి కళాసేవ' అనే గ్రంథంలో సంగీత సాహిత్యాలు రెండింటిలో అభినివేశమున్న లక్ష్మీకాంతమ్మగారు వాగ్గేయకారుల యొక్క సంగీత సాహిత్య విశేషాలని వివరించారు. ఆమె సంగీత ప్రావీణ్యానికి నిదర్శనం ఈ గ్రంథం. ఆంగ్లంలో ప్రొఫెసర్ హుమయూన్ కబీరు రచించిన Lessons of Indian History అనే గ్రంథాన్ని 'భారత చరిత్ర– కొన్ని గుణపాఠములు' అనే పేరుతో లక్ష్మీకాంతమ్మ గారు అనువాదం చేశారు.

సాహితీ రుద్రమ అనేది లక్ష్మీకాంతమ్మగారి స్వీయచరిత్ర, ఇందులో తన అన్నగారు వర్ణాంతర వివాహం చేసుకొన్నారని, కన్యకా పరమేశ్వరీ సుప్రభాతం రచనా పోటీలలో తనకు రెండవ బహుమతి మాత్రమే వచ్చినదని తెలుపడంలో ఆమె నిజాయితీ ఆత్మ స్థైర్యం స్పష్టమవుతుంది.

కళా ప్రపూర్ణ శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారిని గూర్చి డాక్టర్ ఆరుద్రగారు– సంస్కృతాంధ్ర భాషల్లోనే కాక సంగీత సాహిత్యాల్లోనూ ప్రవీణురాలు, ఈమెకు తెలియని, ఆంధ్ర రచయిత్రి ఎవరైనా ఉంటే ఆమె దేశానికి తెలియని రచయిత్రి అని చెపితే తప్పులేదు' అని ప్రశంసించారు.

డాక్టర్ సి. నారాయణరెడ్డిగారు ఆమెను గూర్చి 'రణ పౌరుషానికి, రాజ్యపాలనా పాటవానికి కాకతీయ రుద్రమాంబ గణుతి కెక్కింది. పాండిత్య వీరానికి, ప్రచం వక్తృత్వ ప్రావీణ్యానికి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ కోటి కెక్కింది. ఆంధ్ర వాఙ్మయి రంగంలో చిరకాలంగా తేజోమూర్తిగా వెలుగొందుతున్న రచయిత్రి ఆమె అని ప్రశంసల జల్లు కురిపించారు.

'కవితయందేకాదు కమనీయ సంస్కృతి
రక్షయందు, గానదీక్షయందు
బహుముఖ ప్రసంగ పరిపాటి యందీమె
వీనుమిగిలె నాంధ్ర విశ్వమునను' అని

తెనుగు లెంక తుమ్మల సీతారామమూర్తి గారు ఆమెను కొనియాడడం సార్థకం.

వివిధ సాహితీ ప్రక్రియలతో, రచనా నైపుణ్యంతో లక్ష్మీకాంతమ్మగారు తనదైన ముద్రతో సాహితీ రుద్రమ బిరుదము సార్థకం చేసుకొన్నారు. ●

నరేంద్రుడే మెరుపు వీరుడు

అవును- ఆయన నరేంద్రుడే
అందరిచేత ఆమోదింపసబడిన నరేంద్రుడు
నరేంద్రుడంటే నరులలో శ్రేష్ఠుడు
ఆ నరేంద్రుడు తూర్పు భారతాన బుట్టి
పశ్చిమ దేశాలను ప్రభావితం చేసి
ఆధ్యాత్మిక వివేకం ఆనందం కలిగిస్తే
ఈ నరేంద్రుడు పశ్చిమ భారతాన బుట్టి
యావత్ప్రపంచంతో తన భావజాలాన్ని
అనుమోదింప జేసిన జ్ఞాన సంపన్నుడు!!
ఒక శివాజీ, ఒక రాణా ప్రతాప్, ఒక బోస్, ఒక పటేల్
కలగలసిన రూపమైన 'ధర్మరుద్రుడు'
నిన్న... బయటి శత్రువుల మీద
సైన్యంతో సర్జికల్ స్ట్రయిక్స్ చేయిస్తే..
నేడు... అంతశ్శత్రువుల మీద, ఆర్థిక నేరస్తుల మీద
నల్లకుబేరుల మీద సాహసోపేతమైన
స్ట్రయిక్స్ చేశాడు 'నల్ల' ధనికులు 'తెల్లబోయేలా'!!
పెద్ద విజయం సాధించడానికి చిన్న చిన్న త్యాగాలకు
అసౌకర్యాలకు అందరం సిద్ధమౌదాం
ఈ నరేంద్రుడు నిజంగా మెరుపు వీరుడు కార్యశూరుడు
మహోగ్రవాదులకు కిశోరుడు
సమగ్రవాదులకు స్నేహహస్తం!!

– డాక్టర్ రాధశ్రీ, కర్నూలు



హేరామ్ అంటూ ప్రాణాన్ని విడిచారు

కొల్లాయి గట్టితేనేమి! మా గాంధి మాలడై తిరిగితే నేమి? నాలుగు పలకలా పిలక! నాట్యమాడే పిలక! అంటూ ఆంధ్రదేశం కీర్తించింది

రఘుపతి రాఘవరాజారామ్ ఈశ్వర అల్లాతేరేనామ్ సబ్‌కో సన్మతి హే భగవాన్ అన్నది ఆయన నిత్య ప్రార్థనా గానం. ఆ గానంలోనే పరవశించాడు. ఆ గానంలోనే ఆయన ప్రాణం విడిచాడు.

1947 ఆగస్టు 14-15 అర్థరాత్రి

కొద్ది క్షణాల్లో ఆగస్టు 15 రాబోతుండగా తొలి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రసంగం. ట్రిస్ట్ విత్ డెస్టినీ అన్నాడు.

తల్లికునుకు తీస్తున్నప్పుడు మేల్కొని కేరింతలు కొడుతున్న బిడ్డను కనిపెట్టుకుని ఉండే రెప్పలకు ఆహ్వానం అన్నారు నెహ్రూ.

అప్పుడు గాంధీజి అక్కడలేరు!

వగచిన యుగం అంతరించి, జాతి ఆత్మ వికసించిన ఈ నడిరేయిలో మళ్లీ ఒక ఒట్టుపెట్టుకుందాం. యావత్ మానవాళి క్షేమం కోసం కట్టుబడి ఉంటామని అన్నారు నెహ్రూ. **గాంధీజీ అక్కడా లేరు.**

భారత స్వాతంత్ర్య పూర్తి దినం. 70వ ఇండిపెండెన్స్‌డే. 68 ఏళ్ల క్రితం బాపూజీ తన 78వ యేట ఒక అతివాది పేల్చిన బులెట్‌లకు నేలకొరిగారు. స్వతంత్ర భారతదేశపు తొలి ఉలికిపాటు అది. గాంధీ హత్య వార్త వినగానే ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్... 'ఇంతటి మహావ్యక్తి ఈ భూమి మీద నడిచాడా! మన మధ్య జీవించాడా అని భావితరాలవారు ఆశ్చర్యపోతారు' అన్నారు.

ఆయన జీవితమే... ఆయన సందేశం.

దేశవిభజనకు ముందు, తర్వాత, దేశంలో చెలరేగేగిన మత కలహాలు గాంధీజీని ఎంతో అశాంతికి గురిచేశాయి. స్వాతంత్ర్యానికి ముందు ఏడాది 1946లో ఆయన హిందూ ముస్లిం అల్లర్లలో శాంతి పునఃస్థాపనకు కలకత్తాలో పాదయాత్ర చేస్తున్నారు. 'బెంగాలీ ప్రజలకు సందేశం ఇవ్వండి' అని పాత్రికేయులు అడిగారు. ఆ రోజు గాంధీ మౌనవ్రతం. ఒక పలకమీద బెంగాలీ లిపిలో 'అమార్ జీబనీ అమార్ బానీ' అని రాశారు. 'నా జీవితమే నా సందేశం' అని దాని అర్థం. సత్యం, అహింస అనే ఆదర్శాలను ఆయుధాలుగా చేసుకున్న మహనీయుని జీవితం కేవలం సందేశం మాత్రమే అవుతుందా? దిక్సూచి కూడా అయింది. అగ్రరాజ్యాలు సైతం నేడు గాంధీ మార్గాన్ని అనుసరిస్తున్నాయి.

గాంధీజీ జీవితానికి ఉద్యమస్వరూపం తప్ప మరో రూపం లేదు. వేరే రూపురేఖలు లేవు. ఈ భారతీయుడి జీవితం ఇంగ్లండ్‌లో మొదలైంది. దక్షిణాఫ్రికాలో పదును తేలింది. భారత్‌లో కదం తొక్కింది.

సముద్రయానం హిందువులకు నిషిద్ధం. నిషేధాన్ని ధిక్కరించి 'లా'చదవడం కోసం 1888లో ఇంగ్లండు వెళ్లారు గాంధీజీ. మూడేళ్లు లండన్‌లో ఉండి వచ్చారు. ముంబైలో 'లా' ప్రాక్టీస్ పెట్టారు. 1893లో దక్షిణాఫ్రికాలో ఒక భారతీయ ముస్లిం కంపెనీ దావాలో వాదించడానికి జూనియర్ లాయర్‌గా వెళ్లే అవకాశం వస్తే డర్బన్ వెళ్లారు. అలా వెళ్లడం వెళ్లడం దక్షిణాఫ్రికాలో 21 ఏళ్లు (1893-1914) గడిపారు. దక్షిణాఫ్రికాలో అనుభవాలు, అవమానాలు, పరాజయాలు, ఆయన్ని ఓ ఉద్యమశిల్పంలా చెక్కాయి.

1914లో దక్షిణాఫ్రికా నుంచి తిరుగు ప్రయాణమై మధ్యలో కొన్నాళ్లు లండన్‌లో ఉండి, అక్కడ ఆరోగ్యం క్షీణించడంతో 1915లో గాంధీజీ ఇండియా చేరుకునే నాటికి... ఇక్కడ స్వాతంత్ర్య కాంక్ష ఉధృతరూపం దాలుస్తూ ఉంది. గాంధీజీ ఏడాదిపాటు దేశమంతా తిరిగారు. మొదట శాంతినికేతన్ వెళ్ళి టాగూర్‌ని కలుసుకున్నారు. తర్వాత గుజరాత్ వచ్చారు. అహ్మదాబాద్‌లో సబర్మతీ నదీ తీరాన ఒక ఆశ్రమం నిర్మించుకున్నారు. ఇండియాలో కూడా దక్షిణాఫ్రికాలోని పరిస్థితులే! తెల్లవాళ్లు, నల్లవాళ్లు, ప్రజావ్యతిరేక నిర్ణయాలు. ప్రభుత్వంపై ఉద్యమకారుల ఆగ్రహాలు. బీహార్‌లోని చంపారన్ జిల్లాలో నీలిమందు పండించే పేద రైతుల పట్ల తెల్లజాతి యజమానులు అనుసరిస్తున్న దోపిడీపై ప్రతిఘటనతో 1917లోలో భారత్‌లో మొదలైన గాంధీజీ ఉద్యమ జీవితం.. రౌలత్ చట్టం, జలియన్‌వాలాబాగ్ ఉదంతం, సహాయ నిరాకరణ, ఖిలాఫత్ ఉద్యమం, చౌరీచౌరీ ఘటన. సంపూర్ణ స్వరాజ్య తీర్మానం, ఉప్పు సత్యాగ్రహం, రౌండ్ టేబుల్ సమావేశాలు, ఆమరణ నిరాహార దీక్ష, వంటి వాటితో 1932 నాటికి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రధాన అధ్యాయం అయింది!

1933లో గాంధీజీ సబర్మతీ నుంచి మహారాష్ట్రలోని వార్ధా వచ్చి అక్కడ సేవాగ్రామ్ పేరుతో ఆశ్రమం నెలకొల్పారు. అక్కడే శాశ్వత నివాసం ఏర్పరచుకున్నారు. హరిజన్ వార పత్రిక స్థాపించారు. హరిజనోద్ధరణ కార్యక్రమం చేపట్టారు. ఖాదీ ఉద్యమం ప్రారంభించారు. తర్వాత రాజకీయ ఉద్యమం 1942లో క్విట్ ఇండియా ఉద్యమం. బ్రిటిష్‌వాళ్ళు వెళ్లిపోయారు. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చింది. అప్పటికి గాంధీ వయసు 77 ఏళ్లు. 1917 నుండి 1947 వరకు 30 ఏళ్లు గాంధీజీ ఉద్యమ జీవితం గడిపారు.

'మహాత్మ' గాంధీ (78), భారత జాతిపిత

పూర్తిపేరు	: **మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధి**
జననం	: **అక్టోబర్ 2 1869**
జన్మస్థలం	: **పోర్బందర్ (గుజరాత్)**
తల్లిదండ్రులు	: **కరమ్‌చంద్ గాంధి. పుత్లిబాయ్**
తోబుట్టువులు	: **లక్ష్మీదాస్, గోకిబెన్, కర్సన్‌దాస్**
చదువు	: **న్యాయశాస్త్రం**
భార్య	: **కస్తూర్బా (వివాహం 1883 మే)**
సంతానం	: **హరిలాల్, మణిలాల్, రామ్‌దాస్, దేవదాస్**

ఆలిండియా సాయి సమాజ స్థాపకుడు

నరసింహస్వామి అయ్యర్

దక్షిణాదివారికి సాయిచరిత్రను తెలియజేసిన నరసింహ అయ్యర్, కావ్యకంఠగణపతి జీవిత చరిత్ర నుంచి అనేక విషయాలు సేకరించి భగవాన్ రమణ మహర్షి చరిత్రను 'సెల్ఫ్ రియలైజేషన్' పేరిట అత్యద్భుతంగా రచించారు. దీన్ని 1931లో తొలిసారిగా రమణాశ్రమం అచ్చువేసింది. అరుణాచలం నుంచి హుబ్లీ చేరిన అయ్యర్ అక్కడి సిద్ధారూఢ స్వామి అనుగ్రహం పొందారు. దురదృష్టవశాత్తూ ఆ స్వామి హఠాత్తుగా కన్ను మూయడంతో అయ్యర్ పండరిపురం వెళ్లారు. ఆ తర్వాత అయిష్టంగానే 1936లో శ్రావణ పౌర్ణమి రోజున అయ్యర్ షిర్డీ చేరారు.

ఆ ఉదయమే చేరిన అబ్దుల్లా సాయిసమాధిని విసనకర్రతో విసురుతుండటం చూసాడు. అయ్యర్ సమాధికి కొద్ది దూరంలో చేతులు జోడించి నిలిచారు. అంతలో అద్భుతం జరిగింది. సాయి సమాధి నుంచి ఓ కాంతిపుంజం వెలువడి అయ్యర్‌లో ప్రవేశించింది. వెనుకటి నరసింహ అయ్యర్ సాయి స్వరూప నరసింహస్వామిగా మారారు. ఆ క్షణంలో ఆయన సుదీర్ఘ అన్వేషణ ఫలించింది. తనకు సద్గురువు లభించాడని స్వామి పరవశించాడు. సాయి సందేశాన్ని ప్రపంచానికి చాటేందుకు ఆయన సాయిదూతగా మారారు. సాయిని సేవించిన, అబ్దుల్లా, యం.బి. రేగేల అనుభవాలను సేకరించారు. మూడేళ్లపాటు మహారాష్ట్రలో సంచరించి 1939లో మద్రాస్ చేరి అఖిల భారత సాయి సమాజ్‌ప్రారంభించారు. సాయిబాబాపై మూడు అద్భుతమైన గ్రంథాలు రచించడంతోపాటు సాయినాథునికి అష్టోత్తర, సహస్రనామావళి రచించడంతో పాటు, సాయి పూజను క్రమబద్ధీకరించారు 15 ఏళ్లపాటు సాయిదూతగా దేశం అంతా తిరిగి సాయిసందేశాన్ని ప్రచారం చేసి తరించారు. మద్రాసుతోపాటు కర్ణాటకలో సాయి ఆధ్యాత్మిక కేంద్రాల్ని నెలకొల్పారు. 1956 అక్టోబర్ 19న నరసింహస్వామి తనువుచాలించారు. ●

Statement about ownership and other particulars about Newspaper
"PRAMUKHANDRA" Chennai - 600 004.
FORM IV (See Rule 8)

1.	Place of Publication	:	Chennai
2.	Periodicity of its Publication	:	Monthly
3.	Printer's Name	:	**G.V. RAO**
	Nationality	:	Indian
	Address	:	Printed at **Goteti Graphics** 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
4.	Publisher's Name	:	**G.V. RAO**
	Nationality	:	Indian
	Address	:	64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
5.	Editor's Name	:	**G.S. RAMARAO**
	Nationality	:	Indian
	Address	:	64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
6.	Name & Address of individuals who own the Newspaper and Partners	:	**GV RAO** 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.

I, **G.V. RAO** hereby declare the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 28-2-2017 **(Sd.,) GV RAO**
Chennai - 600 033. PUBLISHER

ఓ కవీ!

1. ఓ కవీ
రమ్యమైన గమ్యం ఆశించి
కలం చేతపట్టావు
కవితలెన్నో రాసావు
2. ఓ కవీ!
కాంక్షల తీరంలో నిలబడి వుంటే
ఆంక్షల సునామీ వచ్చిందా
చలిజ్వరం వచ్చినోడిలా వణికిపోతున్నావు
3. ఓ కవీ!
కాలగర్భంలోని చరిత్ర
ధరిత్రిపై నిక్షిప్తం చేయాలని
నీ మనసు పరవళ్లు త్రొక్కిందా!
4. ఓ కవీ!
దూషణ భూషణలు ధరిస్తూనే
ఒంటరిగా సాగిపోతున్నావే
కాలం మానని గాయం చేసిందా!
5. ఓ కవీ!
నీ నవ్వులే పువ్వులై పరిమళించే రోజు
దగ్గరలోనే వుంది మర్చిపోకు

–మేడిచర్ల సూర్య ప్రకాశరావు, రామరాజులంక

రావు బాలసరస్వతికి ఏ(వి రావు?

నేను పుట్టింది 1928లో. 1934లోనే హెచ్ఎంవి సంస్థకు సోలో రికార్డు పాడాను. ఆ రికార్డు విని సి.పుల్లయ్యగారు మా నాన్నగార్ని సంప్రదించి ఇందులో గంగ వేషం ఇచ్చారు. ఆ వయసులో నాకు సినిమా అంటే తెలీదు. షూటింగ్ అంటే తెలీదు. ఏదో సెలవుల్లో ఆడుకోవడానికి కలకత్తా వెళ్ళినట్టుగా అనిపించిందంతే. ఈ సినిమా షూటింగ్‌లో జరిగిన రెండు సంఘటనలు నాకిప్పటికీ గుర్తున్నాయి. జనుల పాపాల వల్ల గంగ కలుషితమైపోయినట్టుగా సీన్ తీస్తున్నారు. దానికోసం నాకు నల్ల డ్రెస్ వేసి, జుట్టు విరబోసుకుని పరిగెత్తమన్నారు. నా వెనుక జనులు పాపాలు పిశాచాల రూపంలో వెంటబడుతుంటాయన్నమాట. ఆ పిశాచాలుగా నటించింది నారదుడు, కైశికుడు వేషాలేసిన కుర్రాళ్లే. వాళ్ళకు వళ్లంతా నలుపురంగు పూసేశారు. నేను మధ్యలో గుర్తుపట్టేసి నువ్వు నారాయణవి కదా అని అడిగేశాను. దాంతో తబలిస్ట్ పరదేశి బెత్తంతో నన్ను భయపెట్టి 'అలా పేర్లు చెప్ప కూడదు. వాళ్ళంతా పిశాచాలు, నువ్వు భయపడాలంతే" అని చెప్పారు. అలా పరిగెడుతూనే 'ఏదీ దారి నాకిచట' అనే పాట పాడాలి నేను. ట్రాలీలో కెమెరాతోపాటు వయొలనిస్ట్, తబలిస్ట్ కూడా కూర్చున్నారు. వాళ్లు అవి ప్లే చేస్తుంటే, నేను పరిగెడుతూనే పాట పాడేశాను. నిజంగా చాలా కష్టం అది. అయినా నేను అవలీలగానే పాడేశాను. ఇక రెండో సంఘటన ఏంటంటే– సతీ అనసూయ దగ్గరకు గంగ వెళ్ళి వరం కోరుకోమంటుంది. ఆశ్రమంలో నది పారేలా చేయమని అనసూయ కోరుతుంది. ఆ సీన్ ఎలా తీశారంటే– ఒక కాలువలా గొయ్యి తవ్వారు. మధ్యలో రాయి మీద నన్ను నిలబెట్టారు. నేను వరం ఇవ్వగానే అటునుంచీ ఇటునుంచీ డ్రమ్ములతో నీళ్లు వదిలేశారు. దీనికి రిహార్సల్ ఏమి లేదు. డైరెక్ట్‌గా షాట్. డ్రమ్ములతో నీళ్లు వదలిన ఫోర్స్‌కి నేను వెనక్కి పడిపోయి నీళ్ళలో కొట్టుకుపోయా. ఆ సినిమాకు అసిస్టెంట్‌గా పనిచేసిన ఓ బెంగాలీ అతను వెంటనే నన్ను పట్టుకున్నాడు. నా అభిమాన గాయకుడు కె.ఎల్. సైగల్‌ని ఈ షూటింగ్ సమయంలోనే కలవగలిగాను. ఆ సినిమాకు నాకు 250 రూపాయలు పారితోషికం ఇచ్చారు.

పత్రికా రచనమూ ఒక కళే!

రచనా కుతూహలము కలవాడు సంపాదకుడైతే లాభనష్టాలను బేరీజు వేసుకోడు!

84 సంవత్సరాల జీవితంలో 62 సంవత్సరాలు పత్రికా జీవితం పండించుకున్నాను.

తాజ్‌మహల్ అందాలను చూచి అనుభవించాను. అదొక మొఘల్ చక్రవర్తి కలలపంట! అతని హృదయ సౌందర్యపు పంట. జాషువాగారు బాల్యము నుండీ తాజ్‌మహల్ను చూడాలనుకున్నారు. చూడలేక పోయారు. **ప్రాప్తిలేమికి చింతింతున్** అని ఒక్క వాక్యంలో చెప్పారు. కానీ ముంతాజ్ మహల్ కావ్యంలో వారు చూచినవారి కన్నా చాలా గొప్పగా వర్ణించారు.

మార్చి 7వ తేదీకి 84 సంవత్సరముల అంచునకు చేరుకుంటున్నానని అనుకుంటున్నప్పుడు ఆనందమూ కలుగుతుంది ఆవేశమూ కలుతుంది. ఆవేదనమూ కలుగుతూంది.

ఎంతకాలం ఈ శరీర ధృఢత్వ ముంటుంది? మానసిక బలం ముందుకు నడిపిస్తుందా? వాటి నిర్ణయం నా ఏలిక వేంకటేశ్వరుని అనుగ్రహంతో ముడిపడి ఉన్నది. నాకు విచారం లేదు.

జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

ఎదుగుదలను నిరోధించే ప్రతికూల పరిస్థితుల మధ్యలో వికసించి పెంపొందడమే జీవితం!

- స్వామి వివేకానంద

ఈ మార్చి 7వ తారీఖుతో నాన్నగారికి 84 ఏళ్ళు పూర్తయ్యాయి. పై వివేకానంద సూక్తి ఆయన జీవితానికి సరిగ్గా పోతుంది. ఎందుకంటే ఒడిదుడుకుల జీవితమే ఆయనది. ఎదురుదెబ్బలన్నిటిని ఎదుగుదలకు మెట్లుగానే ఉపయోగించుకున్నారు. అలాటివారు చాలా అరుదుగా వుంటారేమో. ఆయన పత్రికలు నడిపారు. సినిమాలకు ప్రెస్ రిలేషన్‌గా వున్నారు. సినిమాలు నిర్మించారు. ఒక ప్రెస్‌ను స్థాపించారు. ఇవన్నీ ఎవరి సపోర్టు లేకుండా, ఎవరితోను భాగస్వామ్యం చెయ్యకుండా ఆయనగానే ఏర్పరచుకున్నవి. పిల్లల పత్రిక బాలరాజ్యం కొన్నాళ్ళు, తరువాత మధురిమ, తరువాత మధురవాణి, తరువాత సినీరమ తెలుగు, తమిళ భాషల్లో, తరువాత సినిమాలు ఇలా రకరకాల వ్యాపారాలు చేస్తూ వొడిదొడుకులతోనే ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ వచ్చారు. వాటిలో చాలావరకు నష్టమే అంటే పెద్దగా సంపాదన లేదనే అర్థం, చిన్నగా కూడబెట్టుకున్న సొమ్ము పోగొట్టుకోవడం. అలా వ్యాపారాలు చేస్తూనే ఒక యిల్లు, ఒక ప్రెస్ ఇదే ఆస్తి. అంతకన్నా, ఆస్తి ముగ్గురు పిల్లలను (మమ్మల్ని) చదివించి స్థిరపరచడం. అందులో నేను దరిదాపుగా 35 ఏళ్ళుగా ఆయనతోను, ఆయన వ్యాపారాలలోను చూస్తూ వుండిపోవడమే. ఆ ఎగుడుదిగుడు బండిలో నేను ప్రయాణం చేశాను. ఇలా అన్నిరకాల నష్టపోయిన కాలంలోనే ప్రముఖాంధ్ర ఉచిత పత్రికను ప్రారంభించాం. త్రికరణశుద్ధిగా తెలుగు భాష, తెలుగువాడి గొప్పదనాన్ని ప్రపంచమంతా చాటి చెప్పడమే పత్రిక ఉద్దేశం. ఆ ఉద్దేశం గొప్పది కాబట్టి 22 ఏళ్ళుగా ఆ పత్రిక నిరాటంకంగా వస్తూ వుంది. ఆ పత్రిక ద్వారా ఆయన దేశ విదేశాలన్నీ తిరిగి వచ్చారు. ఎన్నో బిరుదులు, సత్కారాలు అందుకున్నారు. ఆ పత్రిక ఆయనలోని మరో కోణాన్ని వెలుగులోకి తెచ్చింది. అదే ఆయనలోని ఆధ్యాత్మిక రచనాశక్తి. ప్రముఖాంధ్రలో మన భాష గొప్పదనాన్ని చెబుతూనే, సంస్కృతీ సంప్రదాయాలను, దేశభక్తి ప్రబోధాలను తెలియపరుస్తూనే వున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే ఆయన రచించిన ఆధ్యాత్మిక వ్యాసాలు ఆయనకు చాలా పేరు తెచ్చిపెట్టాయి. ఆ స్ఫూర్తితో ఆయన "అధ్యాత్మ రామాయణం", "శ్రీకృష్ణ" పుస్తకాలను రచించారు. ఈ రెండు పుస్తకాలు ఆయన ఆరోగ్యం బాగులేనప్పుడు రాసినవి. ఆ నాలుగేళ్లలో నాలుగుసార్లు ఆస్పత్రిపాలయ్యారు. ఓపిక నశించింది. అయినా ఆయన సంకల్ప బలంతో పూర్తిచేసి వాటిని విడుదల చేయగలిగారు. ప్రముఖాంధ్ర ద్వారా ఆయన చేస్తున్న సేవను ఎందరో ప్రశంసించారు. ఎందరో పీఠాధిపతులు, స్వామిజీలు గుర్తించి ఆశీర్వదించారు. భగవంతుడు, గురువుల, స్నేహితుల ఆశీర్వాద, అభిమానాలే ఆయనకు శ్రీరామరక్ష. ఇలాగే ఒక్కొక్క పుట్టినరోజు నాడు నేను ఆయన గురించి రాయాలని 2019లో ప్రముఖాంధ్ర 25వ సంవత్సరం రజతోత్సవాన్ని మా తండ్రి కొడుకులిద్దరం జరపాలని దానికి మా ఇలవేలుపు శ్రీ వేంకటేశ్వరస్వామి కృపా కటాక్షములు వుంటాయని, వుండాలని ఆకాంక్షిస్తూ మీ అందరి అభిమానంతోపాటు నా ఆశ కూడా ఫలించాలని మీ అందరూ మనస్ఫూర్తిగా కోరుకుని, ఆశీర్వదించండి.

* * *

మన దేశంలో మంచిని మెచ్చుకునే లక్షణం లేదు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా నేనిలా అనవలసి వస్తోంది. చదువు చెప్పే విశ్వవిద్యాలయాల్లో రాజకీయం చేయడం, దేశాన్ని దేశ గౌరవాన్ని కించపరిచే విధంగా మాట్లాడడం, వాక్ స్వాతంత్ర్య పేరుతో వాటిని చదువుకున్న ఎర్రని వారు సమర్థించడం చూస్తూంటే ఇది పురోగమనమా? తిరోగమనమా? అర్థం కావటం లేదు. విద్యార్థి లోకాన్ని మనం ఎలా విషపూరితం చేసామోనని బాధగా వుంది. ఈ విషవలయ సుడిగుండంలో అమాయక విద్యార్థులు సమిధలవ్వడం విచారకరం. ఈ ప్రపంచంలో ఎన్ని వందల వృత్తులున్నా వారినందరినీ తయారుచేసే వృత్తి ఉపాధ్యాయ వృత్తి, అందుకే ఆ వృత్తి అంటే నాకు ఎంతో గౌరవం అన్నారు అబ్దుల్‌కలాం. మరి అంతటి పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో వున్నవారు రాజకీయాలు చేయడమేమిటి? దేశ వ్యతిరేక విధానాలను సమర్థించడమేమిటి, కుర్రాళ్ళను వెనుకేసుకొచ్చి వారిని దేశానికెదురుగా మాట్లాడమని ప్రోత్సహించడమేమిటి. ఎవరైనా ఇదేమిటని అడిగితే దేశీయం మాకు నేర్పక్కరలేదని ఒకసారి, వాక్ స్వాతంత్ర్యమని ఒకసారి విరుచుకుపడడమేమిటి, విద్యార్థులను హింసకు ప్రేరేపించడం, వారిని హీరోలుగా ప్రోత్సహిస్తూ టీవీ డిబేటులకు, ఫేస్‌బుక్కులకు పోస్టులు పెట్టమని ప్రోత్సహించడం ఎంతవరకూ సబబు? కొంతమంది విద్యార్థులు అదే ఈ గొడవలలో పాల్గొనే విద్యార్థులు. 35 ఏళ్ళు వయసొచ్చినా ఇంకా యూనివర్సిటీలలోనే వుంటూ, ఉపకార వేతనాలు పొందుతూ, ఫీజు రాయితీలు పొందుతూ దేశగౌరవాన్ని భ్రష్టు పట్టించే విధంగా నడుచుకోవడం, ముమ్మాటికి దేశద్రోహమే. దేశప్రజలు కట్టిన ట్యాక్సుల సొమ్ముతో చదువుకుని ఆ దేశాన్ని విచ్చిన్నం చేయాలనుకోవడం, దేశాన్ని విభజించాలని ఆందోళనలు చెయ్యడం తల్లి పాలు తాగి రొమ్ము గుద్దడంతో సమానం. ఆ పిల్లలు తల్లిదండ్రులకు బాధ్యత లేదా. మనకెందుకులే అని ఊరుకోవడమా? ఏది ఏమైనప్పటికి ప్రభుత్వం తప్పు ఎవరిదైనా వారిపై దయాదాక్షిణ్యాలు చూపకుండా చర్య తీసుకుంటేనే ప్రజలు చట్టాన్ని గౌరవిస్తారు. కాబట్టి ఈ వైరస్ పెరగకుండా చూసుకోవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. దీనికి సరైన విరుగుడు మందు వెయ్యమని వారిని కోరుకుంటున్నాను. ●

GOTETI GRAPHICS

- Visiting Cards
- Invitation Cards
- Wedding Cards
- Journals
- Books
- Annual Reports

Souvenirs &

COMPLETE OFFICE STATIONERY PRINTING

Digital Printing
Offset &
Mini Offset
Soft, Hard, Spiral
BINDING

64 (16), Thambiah Road, West Mambalam,
Chennai - 600 033. INDIA **Tel : 2474 2091, 2371 6322**
E : gotetigraphics@gmail.com

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA
March 2017

REGN. No. TN/CC(S)DN/177/15-17
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97